సాక్షి
నిర్మల్

శుక్రవారం, 29, నవంబర్, 2024

మళ్లీ పులి

ఖానాపూర్: ఖానాపూర్ శివారులోని మామడ మండలం దిమ్మదుర్తి అటవీ ప్రాంతంతోపాటు ఖానాపూర్ రేంజ్ పరిధిలోని ఎక్బాల్‌పూర్ బీట్ ప్రాంతంలో పులిసంచరిస్తోందని ఖానాపూర్ ఎఫ్ఆర్‌వో కిరణ్ తెలిపారు. గురువారం పులి కనిపించిందని ఎక్బాల్‌పూర్ గ్రామస్తుల నుంచి సమాచారం అందడంతో అటవీ ప్రాంతంలో వెళ్లి పులి పాద ముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యారణ్య భారతి స్వామీజీ రాక

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామంలో మహా దత్త జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం 108 జంటలతో యజ్ఞం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హంపి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య భారతి స్వామీజీ హాజరు కానున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.4 /15.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లగాలులు వీస్తాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అమ్మవారిని దర్శించుకున్న బ్యాంకు ప్రతినిధులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్‌బీఐ అధికారులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జనరల్ మేనేజర్ రవికుమార్‌వర్మ, డిప్యూటీ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ సాహూ గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రదీప్ పూజారి అమ్మవారి హారతి ఇచ్చి తీర్థ ప్రసాదలు అందించారు. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా రీజినల్ మేనేజర్ మహేశ్వర్, శ్రీనివాస్ జనరల్ మేనేజర్‌ను సన్మానించారు. వీరి వెంట బాసర బ్రాంచ్ మేనేజర్ అశోక్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే



జ్యోతిబాపూలేకు నివాళులర్పిస్తున్న సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్

నిర్మల్‌టౌన్: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బలహీనవర్గాల విద్య కోసం ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కోకన్వీనర్ కిషన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు



గెలుపొందిన విద్యార్థులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. జిల్లా పరీక్షల అధికారి సిద్ధ పద్మ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ ప్రశ్న పత్రాలు విడుదల చేశారు. హేతుబద్ధంగా ఆలోచిస్తే మూఢనమ్మకాలు వీడి మోసాలకు గురి కాకుండా ఉంటామని విద్యార్థులకు సూచించా రు. ప్రొఫెసర్ వెలుమల మధు మాట్లాడుతూ జీవపరిణామ క్రమంలో పరిస్థితులను తట్టుకుని జీవించిన జీవులే మనుగడ సాగిస్తాయన్నారు. వాతావరణ పరిస్థితులు ఆహార లభ్యత కొత్తజాతుల ఆవిర్భావానికి దారితీస్తుందని తెలిపా రు. పరీక్షలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జిల్లా ఇన్‌చార్జి చెలిమెల పద్మ, డీఎస్‌వో వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ఆకుల సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు అంకం గంగాధర్, షేక్ రఫీక్, బాజారెడ్డి, నారాయణవర్మ, గంగన్న, గజపల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే జీవరాశి మనుగడ



మొక్కను నాటుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాధిక

నిర్మల్‌టౌన్: భూమిపై జీవరాశి మనుగడకు మొక్కలు అవసరమని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి జి.రాధిక అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణంలో పానికి, ఇతర ప్రత్యేకమైన మొక్కలు గురువారం నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడం పర్యావరణానికి, ప్రాణులకు, సమాజానికి, ఆరోగ్యానికి, జీవితానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇథనాల్ పోరు ఓ పాఠం



- 'ముందుచూపు'లేని పాలకులకు..
- అవగాహన లేని అధికారులు..
- స్వార్థంతో పనిచేసే నేతలకు..
- విధానాలు వెల్లడించని వ్యాపారులు..
- గుణపాఠాలు నేర్పించిన పల్లెలు

నిర్మల్: ఇథనాల్ ఫ్యాక్టరీపై ఇంత లొల్లి ఎందుకైంది..!?

అసలు.. ఆ పల్లెలు అంతలా ఎందుకు తిరగబడ్డాయి..!?

ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అందరూ అడుగుతున్న ప్రశ్నలివి. కానీ.. సరైన సమాధానాలు ఎవరూ చెప్పడం లేదు. ఎందుకంటే.. ఆ ఊళ్లు బాధితులైతే.. ఆ ఫ్యాక్టరీ పచ్చని పొలాలమధ్య పెట్టడానికి మిగతా వ్యవస్థలన్నీ ఎంతోకొంత బాధ్యులే కాబట్టి. జిల్లాలో దిలావర్‌పూర్–గుండంపల్లితోపాటు చుట్టూ ఉన్న సముందర్‌పల్లి, కాండ్లి తదితర గ్రామాల్లో రెండేళ్లుగా నలుగుతున్న ఈ అంశంపై పూర్తి అవగాహన కల్పించిన దాఖలాలు గానీ.. అసలు ఆ ఫ్యాక్టరీ గురించి చెప్పినవాళ్లుగానీ లేరు. మొత్తం మీద.. ఈ పరిశ్రమ మా ఊళ్ల మధ్యలో ఏర్పాటైతే, ఎప్పటికైనా మా నీళ్లు, చేళ్లు గుల్లవుతాయన్న ఆందోళనే చుట్టూ ఉన్న ఆ గ్రామాలను కదిలించింది. తమ పిల్లల భవిష్యత్తు కోసం తమ ప్రాణాలకు తెగించైనా సరే.. ఆ పరిశ్రమను అడ్డుకోవాలన్న వారి పట్టుదలే సర్కారును దిగివచ్చేలా చేసింది. చివరకు దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమను ఆపేస్తామని ప్రకటించేదాకా పోరాటం సాగింది. రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా నిలిచిన ఈ 'ఇథనాల్ పోరు–గెలిచిన పల్లెల తీరు' జిల్లాలోని వ్యవస్థలకూ పాఠాలను నేర్పాయి.

ముందే తెలియదా..!?

అసలిక్కడ పరిశ్రమను ఎందుకు పెట్టారన్న ప్రశ్నకు.. 'కేంద్ర ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందండి..' అని కొందరు చెబుతుంటే.. 'అప్పటి రాష్ట్ర ప్రభుత్వమే అన్నింటికీ గ్రీన్‌సిగ్నల్ చూపింది..'అని మరికొందరు చెబుతున్నారు. కేంద్రమా.. రాష్ట్రమా..! ఏ ప్రభుత్వమైనా పరిశ్రమలకంటే ప్రజలకే తొలి ప్రాధాన్యతనివ్వాలి కదా..! అసలు ఆ పరిశ్రమ ఏర్పాటు చేసేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్కడ ఫ్యాక్టరీని పెడితే ఏమవుతుందన్న విషయాన్ని అంచనా వేయలేదా..!? అన్న ప్రశ్నలు గత రెండుమూడురోజులుగా చర్చకు వస్తున్నాయి. పాలకులు సరే.. మరి అన్నీ తెలిసిన అధికారులు ఏంచేశారన్న ప్రశ్నలూ వాదనకొస్తున్నాయి. ఏదైనా పరిశ్రమకు అనుమతులు ఇచ్చేముందు అక్కడి పరిస్థితులను ఎందుకు అంచనా వేయలేదు..!? భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఉంటాయన్న విషయాన్ని ఎందుకు ఆలోచించలేదు..!? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాభిప్రాయమేది..!?

'మా ఊళ్ల మధ్యలో ఇంత పెద్ద ఫ్యాక్టరీ పెట్టే ముందు కనీసం మాకు చెప్పరా..!? అసలు అదేం ఫ్యాక్టరీ అనే విషయాన్ని వివరించరా..!? చుట్టూ వందల ఎకరాల్లో మా పంట భూములు ఉన్నాయి కదా.. మరి పరిశ్రమ పనులను ప్రారంభించే ముందు మా అభిప్రాయాన్ని ఎందుకు తీసుకోలేదు..!?' అంటూ దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాలు వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ ఎవరూ సమాధానాలు చెప్పలేదు. ఏ పరిశ్రమ ప్రారంభించినా ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుంటారు. అలా చేపట్టకున్నా.. కనీసం సమీప ప్రజలకు ఆ పరిశ్రమల గురించి అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అధికారులు, యాజమాన్యం అలాంటివి చేయకపోవడమూ గ్రామాల్లో మరింత అపోహలు పెంచాయి. ఇవే చివరకు ఆ ఇథనాల్ ఫ్యాక్టరీపై తెగించి కొట్లాడేదాకా తీసుకువచ్చాయి.

వ్యవస్థలకు పాఠాలుగా..

'ఏ రెండే ఊళ్లు కదా.. ఏమవుతుంది. తర్వాత చూసుకుందాం..' అని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అన్ని వ్యవస్థలకు 'ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాటం' ఎన్నో పాఠాలను నేర్పించింది. జిన్నింగ్ ఫ్యాక్టరీలు, రైస్‌మిల్లులను మాత్రమే చూసిన జిల్లా.. ఇలాంటి పెద్ద ఫ్యాక్టరీలను చూడటం ఇదే తొలిసారి. పరిశ్రమలు అంటేనే కాలుష్యం అన్న ధోరణి ఉండటం సహజం. ఇలాంటి ప్రాంతాల్లో ప్రజల్లో ఉన్న అపోహలను ముందుగా తొలగించాలన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. ఇది జీరో పొల్యూషన్ ప్రాజెక్టు అని చెప్పిన యాజమాన్యం, అధికారులు ప్రజలకు అర్థం చేయించడంలో విఫలమయ్యాయి. ఇక ప్రజాభీష్టాన్ని గుర్తించకపోతే ఎలాంటి పరిస్థితులు ఉంటాయో.. పాలకులు, అధికారులతోపాటు ప్రధాన పార్టీల నేతలకూ ఆ ఊళ్లు కళ్లకు కట్టించాయి.

అలా గెలిచారు..

'ఇథనాల్'పై పోరులో ఆ ఊళ్లు గెలిచిన తీరు, జిల్లా అధికారులు వ్యవహరించిన సంయమన ధోరణిపైనా చర్చ కొనసాగుతోంది. దాదాపు రెండేళ్లుగా దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాలు 'ఎక్కని గడప లేదు–తొక్కని ఇల్లు లేదు..' అన్నట్లుగా పాలకులు, జిల్లా అధికారులతోపాటు ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లాయి. ఆ పరిశ్రమ ఏర్పాటైతే ఇక తమ పంటపొలాలు చేతికిరావని, తమ పిల్లల భవిష్యత్తు అంధకారమేనన్న భావనే ఆ ఊళ్ల మహిళలను ముందుకు నడిపించాయి. ఈక్రమంలోనే ప్రాణాలకై నా తెగిస్తాం.. అన్నట్లు పురుగులమందు డబ్బాలను ముందుకు పెట్టుకుని మరీ పోరాడారు. పోలీసు బలగాలకూ వెరువకుండా గంటల పాటు బైఠాయించారు. గత కొన్నినెలలుగా సాగిస్తున్న రిలే నిరాహార దీక్షలూ ఈ గ్రామాల్లో ఐక్యతను పెంచాయి. భార్యాభర్తలు, తండ్రీకొడుకులు, తల్లీబిడ్డలు ఇలా అందరూ పోరులో భాగమయ్యారు. ఇక్కడ పార్టీలకతీతంగా ఆ గ్రామాల నేతలు, కార్యకర్తలు సైతం పోరులో భాగం కావడం గమనార్హం. ఇలాంటివన్నీ 'ఇథనాల్'పై ఆ ఊళ్లు గెలిచేలా చేశాయి.

ప్రజాభిప్రాయం తీసుకోలేదు..



మా గ్రామాల మధ్యలో ఫ్యాక్టరీ పెట్టే ముందు కనీసం ఎలాంటి ప్రజాభిప్రాయం తీసుకోలేదు. దాని వల్ల నష్టాలు ఉంటాయని తెలియడంతోనే మేమంతా అడ్డుకోవాలని నిర్ణయించుకున్నాం. ఈమేరకు కలిసికట్టుగా నెలల తరబడి పోరాటం చేస్తూనే వచ్చాం.

– పీసరి శైలేశ్వర్, దిలావర్‌పూర్

ఆపేదాకా వెనక్కు రావద్దని..



తమ గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీతో భూములు, నీళ్లు అన్నీ ప్రభావితమవుతాయని తెలిసిన తర్వాత అందరం కలిసి దాన్ని ఎదుర్కొవాలనుకున్నాం. ఈసారి ఫ్యాక్టరీని ఆపేదాకా వెనక్కు తగ్గొద్దనే రోడ్డెక్కాం. అనుకున్నది సాధించాం.

– ఎలాల చిన్నారెడ్డి, గుండంపల్లి

భార్యాభర్తలిద్దరం..



పచ్చని పంటపొలాల్లో, ఊళ్లకు సమీపంలో ఫ్యాక్టరీలు పెట్టడం సరికాదన్న అభిప్రాయం రాగానే మా గ్రామాలం వాటిపై పోరాడాలని డిసైడ్ అయ్యాం. మేమిద్దరం ప్రతిరోజూ పోరాటంలో ముందున్నాం. అందరికీ అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తూ వచ్చాం. సర్కారు తీసుకున్న నిర్ణయంతో హర్షం వ్యక్తంచేస్తున్నాం.

– ఆలూరు లక్ష్మీ,రమణ, దిలావర్‌పూర్

నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



ఇన్సినరేటర్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, హెడ్ కుక్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా కేజీబీవీలలో విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీలలో చదివే ప్రతీ విద్యార్థికి మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఎస్‌వోపీ నిబంధనలు పాటిస్తూ ఆహారం వండాలన్నారు. వంటకు తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులు వినియోగించాలన్నారు. సరఫరాదారులు అందించిన వస్తువుల నాణ్యతను ప్రత్యేకాధికారులు పరిశీలించాలన్నారు. వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. విద్యార్థుల శారీరక దృఢత్వానికి అందిస్తున్న రాగి జావా నాణ్యతగా ఉండాలన్నారు. అనంతరం జిల్లాలోని 18 కేజీబీవీలకు రెండేసి చొప్పున మొత్తం 36 ఇన్సినరేటర్ పరికరాలు అందజేశారు. సమావేశంలో డీఈవో పి.రామారావు, అధికారులు సలోమి కరుణ, పద్మ, వెంకటరమణ, లింబాద్రి, కేజీబీవీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పెంబి మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం



పూర్ణచందర్‌గౌడ్

పెంబి: గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెంబి మాజీ సర్పంచ్ ఆర్గుల పూర్ణచందర్‌గౌడ్ రూ.30 లక్షల అప్పు చేసి గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాడు. సర్పంచ్ పదవీకాలం ముగిసినా ఇప్పటివరకు బిల్లులు రాలేదు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన పూర్ణచందర్‌గౌడ్ బుధవారం ఇంటికి తిరిగి వస్తూ బస్సులో పురుగుల మందు తాగాడు. నిర్మల్ వచ్చిన వెంటనే గమనించిన సన్నిహితుడు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

తానూరు: మండలంలోని భోసి జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఉత్తర తెలంగాణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ ఇన్‌చార్జి చైర్మన్ సాప పండరి మాట్లాడుతూ యువత మత్తు పదార్థలకు అలవాటు పడకుండా ఉన్నత చదవులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశేఖర్, శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్తాద్రి, నాయకులు లక్ష్మణ్‌రావుపటేల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న డీఈవో రామారావు

- డీఈవో రామారావు

లోకేశ్వరం: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠాలు బోధించాలని డీఈవో రామారావు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతోపాటు రాజూర, మన్మద్ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించా లన్నారు. లోకేశ్వరం పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. రాజూర పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. డీఈ వో వెంట తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఎంపీడీవో వెంకటరమేశ్, సెక్టోరియల్ అధికారి లింబాద్రి, ఎంఈవో చంద్రకాత్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

4న జాతీయ సాధన సర్వే పరీక్ష

నిర్మల్ రూరల్: డిసెంబర్ 4న జిల్లాలో నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్షను విజయవంతం చేయాలని డీఈవో రామారావు సూచించారు. జిల్లా కేంద్రంలోని పంచశీల్ బీఎడ్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాతీయ సాధనా సర్వే పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఇప్పటికే పరీక్షకు ఏర్పాట్లు చేశామన్నారు. 136 మంది నిర్వాహకులు(ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్)లకు రెండు డివిజన్‌లలో శిక్షణ పూర్తి చేశామన్నారు. పరీక్షకు పరిశీలకులుగా నియమించిన 90 మంది ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణలో చెప్పిన విషయాలు జాగ్రతగా విని, తప్పిదాలకు ఆస్కారం పరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. ఇందులో పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి విజయ, ఎంఈవోలు రమణారెడ్డి, విజయకుమార్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, ఎస్‌వోలు రాజేశ్వర్, ప్రవీణ్ కుమార్, లింబాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందర్శిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..



భైంసా మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ అధికారులు



ఖానాపూర్ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల సిబ్బందితో ట్రైనీ అధికారులు

- జిల్లాలో కొనసాగుతున్న ట్రైనీ సివిల్స్ అధికారుల పర్యటన

ఖానాపూర్/భైంసాటౌన్: జిల్లాలో ట్రైనీ సివిల్స్ అధికారుల పర్యటన కొనసాగుతోంది. బృందాలుగా ఏర్పడి రోజుకో మండలంలో పర్యటిస్తున్నారు. పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను సందర్శిస్తున్నారు. విద్యార్థులు, ప్రజలతో మాట్లాడుతున్నారు. సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. పథకాల అమలు తీరుపై ఆరా తీస్తున్నారు. గురువారం ఖానాపూర్, భైంసా పట్టణాల్లో పర్యటించారు. ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన తీరుపై ఆరా తీశారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. డైనింగ్ హాల్‌కు వెళ్లి భోజన మెనూ పరిశీలించారు. పలు ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలు, ఆసుపత్రి, డంపింగ్ యార్డును సందర్శించడంతోపాటు గాంధీనగర్ ఎస్సీ కాలనీలో పర్యటించారు. అనంతరం ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయం సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలు అధికారులు, సిబ్బంది విధులు ప్రభుత్వ పథకాల అమలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది వివరాలు, ఇతర పలు అంశాలను వైద్యుడు సాయి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హమీద్, పక్కనే ఉన్న హైస్కూల్‌లో హెచ్‌ఎం రాజలింగంతో వేర్వేరుగా మాట్లాడి విద్యార్థుల హాజరు, బోధన తీరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అక్కడి నుంచి గాంధీనగర్ ఎస్సీ కాలనీకి వెళ్లి ప్రజలు, కాలనీలోని సమస్యలు తెలుసుకున్నారు. అక్కడే ఉన్న బస్తీ దవాఖానా, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పట్టణ శివారులోని మున్సిపల్ డంపింగ్‌యార్డును పరిశీలించారు. అనంతరం కమిషనర్ మనోహర్‌తో కలిసి చెత్త సేకరణ, నిర్వహణ, ఇతర అంశాలను తెలుసుకున్నారు. భైంసా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన మరో బృందం మున్సిపాలిటీ విధులు, నిధులు, సిబ్బంది, పారిశుధ్యం, నిర్వహణ, తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఏరియాస్పత్రిని సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలను సూపరింటెండెంట్ కాశీనాథ్ వారికి వివరించారు. మదీనా కాలనీలోని జెడ్పీ బాలికల ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించారు. అక్కడి నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లి చెత్త నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు.

అమ్మ.. నాన్నలు గుర్తుకు రావడం లేదు

మారుమూల గ్రామాల నుంచి వచ్చిన తమకు ఖానాపూర్ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించారని, మంచి భోజనం అందించి, నాణ్యమైన విద్య, క్రీడలతోపాటు కంప్యూటర్ వంటి సాంకేతికను విద్య అందిస్తున్నారని గిరిజన విద్యార్థి సత్యపాల్ ట్రైనీ సివిల్స్ అధికారులకు హిందీలో తెలిపాడు. అమ్మ.. నాన్నలు గుర్తుకు రాకుండా చూసుకుంటున్నారని పేర్కొన్నాడు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- కలెక్టరేట్‌లో సర్పంచుల వినతి

నిర్మల్‌చైన్‌గేట్: గత ఐదేళ్లలో గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం చేసిన పనుల బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో అనేక అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రతీ పనిని సకాలంలో పూర్తి చేసేందుకు అప్పులు చేశామన్నారు. కానీ వాటి తాలూకు బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పదవీకాలం ముగిసి ఏడాది కావొస్తున్నా బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈనెల 27న పెంబి సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యాయత్నం చేశారని తెలిపారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.



కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచుల సంఘం నాయకులు

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: జీవితంపై విరక్తితో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం.. సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన నలిమెల కాంతయ్య(43) ఇటీవల దుబాయ్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక నెలక్రితం స్వదేశానికి తిరిగివచ్చాడు. ఈనెల 25న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. జిల్లాకేంద్రం శివారులో స్థానికుడు గురువారం బహిర్భూమికి వెళ్లగా కాంతయ్య ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి ఫోన్‌ను పరిశీలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వ్యవసాయంలో లాభాలు రాక, దుబాయిలో పని దొరకక జీవితంపై విరక్తితో కాంతయ్య ఉరేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తిర్పెల్లి సమీపంలో చిరుత పులి

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి సమీపంలో గురువారం సాయంత్రం చిరుత పులి కలకలం రేపింది. లక్ష్మణచాందకు చెందిన రైతు అట్ల రాంరెడ్డి కొరిటికల్ నుంచి వస్తుండగా చిరుత పులి కనిపించింది. అది కిందకు దిగి పసుపు పంటలోకి వెళ్లిందని తిర్పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని చాటింపు వేయించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి గురువారం తనిఖీ చేశారు. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీకి సీఐ సైదారావు, ఎస్సై రాహుల్‌తోపాటు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ నిర్వహించి, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయంతోపాటు ఎస్సై కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రజ లు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీసుల ను సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు. పోలీసులు ప్రజలతో మమేకం అవ్వాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయికుమార్, శంకర్, కృష్ణసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఔరా..బాల మేధావులు

- చిన్నారులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు
- ఆసిఫాబాద్‌లో రెండురోజులు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుంది. విద్యతోపాటు పరిశోధన, ప్రయోగ సామర్థ్యాలు మెరుగుపర్చి భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా తయారు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యర్థ పదార్థాల నిర్వహణ, వనరుల వినియోగం, విపత్తు నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం అంశంపై జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గురువారం ఈ వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీఈవో యాదయ్య ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి 500 మంది చిన్నారులు పాల్గొన్నారు. మొత్తం 358 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేలా ప్రదర్శన ఇచ్చారని తెలిపారు. సైన్స్ ఇష్టపడి చదివినవారు తమ సృజనతో పలు సమస్యలకు త్వరగా పరిష్కారం చూపగలుగుతారన్నారు. నేను సైన్స్, గణితంలో 100కు 100 మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని అని తెలిపారు. చిన్నారులను భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రతిభ చాటాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ ఢిల్లీ సీనియర్ అసోసియేట్ శుభదీప్ బెనర్జీ, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్, నిర్వహణ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బియ్యం శుద్ధి చేసే యంత్రం



బియ్యం వడే సమయంలో పెద్దపాత్రల్లో కబ్‌గిర్ సాయంతో తిప్పుతూ వంట చేస్తారు. ఈ యంత్రంతో స్టాడ్ తయారు చేసి సైకిల్ చక్రంతో తిప్పితే సరిపోతుంది. బియ్యం శుద్ధితోపాటు పురుగులు, చెత్త నీటిలో తేలుతుంది. దీని తయారీకి రూ.1500 ఖర్చవుతుంది. – శేషాక్, సాంఘిక సంక్షేమ గురుకులం, ఆసిఫాబాద్

వ్యర్థాలతో డెకరేషన్



వ్యర్థాలతో ఇంటిలో మంచి డెకరేషన్ ప్లవర్ల వెరైటీలను తయారు చేసి ప్రదర్శించాను. పగిలిన అందం, ప్లాస్టిక్ బాటిల్‌తో బొకే, పడేసిన పేపర్‌తో డెకరేషన్ తయారీ చేశాను. పత్తి, సుతిల్ తాడు ఉపయోగించి, పేపర్‌తో సీతాకోక చిలుక తయారు చేసి ప్రదర్శించాను. – నిహారిక, సిర్పూర్(టి) కేజీబీవీ

కరెంట్ లేకుండానే బావి నీరు



కరెంట్ మోటారు, సోలార్‌తో బావి, బోరు నీటితో పంటలు పండిస్తారు. ఎలాంటి మోటారు లేకుండా బావి నీరు బయటకు వచ్చేలా ప్రయోగం చేశాను. రెండు వాటర్‌డబ్బాలు తీసుకుని వాటికి పైపులు అమర్చి మధ్యలో ఉన్న డబ్బాలో సగం వరకు నీరు నింపాను. కింద ఉన్న ట్యాబ్‌ను ఓపెన్ చేస్తే నీరు కింది వస్తుంది. పోసిన నీరు ఖాళీ అయిన వెంటనే పీడనంతో బావి నీరు బయటకు వస్తుంది. – శ్రీవాణి, అంజలి, గన్నారం పాఠశాల, కాగజ్‌నగర్

ఇంటిపై కూరగాయల సాగు



ఇంటిపై హైడ్రో ఫోనింగ్‌తో కూరగాయల సాగు చేసుకోవచ్చు. పట్టణంలో ఖాళీ స్థలం ఉండదు. ప్లాస్టిక్ పైపుల్లో నీటిలో న్యూట్రిషన్ కలిపి సాగు చేసుకోవచ్చు. మందుల పిచికారి చేయాల్సిన అవసరం లేకుండా సాగు విధానాన్ని ప్రదర్శనలో చూపించాను. – అత్విక్, రవీంద్రనగర్, మం.చింతలమానెపల్లి

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో గురువారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–17 విభాగంలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటినవారిని ఎంపిక చేశారు. డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంఈవో పోచయ్య, ఎస్జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు సీవోఈ విద్యార్థి



లక్ష్మీనరసింహాను సన్మానిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాల విద్యార్థి లక్ష్మీనరసింహా జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి బాక్సింగ్‌పోటీలు జరిగాయి. పోటీల్లో అండర్–14 విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆయన్ను బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్, పీఈటీలు అల్లూరి వామన్, ఎం.రాజశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్



సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని రైతులకు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సోన్: రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ అన్నారు. మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో పసుపు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో పసుపు పంటపై గురువారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త మహేందర్‌తో కలిసి డీఏవో అంజిప్రసాద్ పాల్గొన్నారు. పసుపు సాగులో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి అన్నారు. అలాగే జిల్లా ఉద్యానవన అధికారి రమణ మాట్లాడుతూ పసుపు పంట కోసిన తర్వాత సరైన మార్కెటింగ్ పద్ధతులు అవలంభించి అధిక ధర పొందాలని సూచించారు.. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, సహజ పద్ధతిలో అధిక దిగుబడులను సాధించాలని పేర్కొన్నారు. అనంతరం నిజామాబాద్ జిల్లా జాక్రన్‌పెల్లి రైతు తిరుపతిరెడ్డి పాటల రూపంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. యూపీఎ మేనేజర్ అపర్ణ, ఏవో వినోద్ కుమార్, హెచ్‌వో మౌనిక, ఏఈవోలు పాల్గొన్నారు.

30న కబడ్డీ ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 30న జిల్లా సీనియర్స్ మహిళా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 6 నుంచి 10వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే 71వ రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, ఫొటో, రిజిస్ట్రేషన్ రుసుంతో ఉదయం 10గంటలకు ప్రగతి మైదానంలోని పీఈటీ సదానందంకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9849124856 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ముత్యంపల్లికి చెందిన బోడకుంట శ్యాంసుందర్ బుధవారం ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి బీరువాలో రూ.80వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదేగ్రామానికి చెందిన దాడి సాయితేజ దొంగతనం చేసినట్లు తేలింది. సోమగూడెం చౌరస్తాలో సాయితేజను గురువారం పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. దొంగిలించిన సొమ్ములో రూ.20 వేలతో సెల్‌ఫోన్ కొన్నాడని, రూ.29 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మిగతా రూ.31వేల నగదు, సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 3, ఆర్కే 7 గనుల్లో జరిగిన బుధవారం రాత్రి షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఎస్సార్పీ 3 గనిలో కోల్‌కట్టర్ కార్మికుడు ఎస్.శ్రీనివాస్ రూఫ్‌కు డ్రెస్సింగ్ చేస్తుండగా చిన్న బొగ్గుపెళ్ల వచ్చి ఆయన కుడికంటి భాగంలో గుచ్చుకుంది. వెంటనే అతన్ని అధికారులు రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేసి పెళ్ల ముక్కను తొలగించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా ఆర్కే 7 గనిలో గని లోపల షార్ట్‌ఫైరర్ కిరణ్‌దాస్ నీళ్లు తాగుతుండగా పైకప్పు నుంచి పై బొగ్గు పెళ్ల అతని వీపుపై పడింది. అధికారులు అతన్ని ఆర్కే 8 డిస్పెన్సరీకి తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు రాజునాయక్, నరేశ్ గురువారం ఇద్దరు క్షతగాత్రులను పరామర్శించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

ఖానాపూర్: అప్పుల బాధ, కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన కళ్యాణ్ గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. ఈవిషయాన్ని స్నేహితుడు పోలీసులకు సమాచారం అందించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది గ్రామానికి వెళ్లి బాధితుడికి ఫోన్‌లో ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో ఎస్సై రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎస్పీ జానకీ షర్మిలతో చర్చించి ఐటీ కోర్ సిబ్బంది తెలిపారు. బాధితుడి సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ పొలిమేరలో గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగించారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. వ్యక్తిని కాపాడిన ఎస్సై, బ్లూకోల్ట్స్ సిబ్బంది సుధీర్, సంతోష్‌లను ఎస్పీ అభినందించారు.

అడవి పందిని హతమార్చిన ఇద్దరి అరెస్ట్

వేమనపల్లి: మండలంలోని ఒడ్డుగూడం శివారులోని మత్తడి వాగు వద్ద అడవి పందిని హతమార్చిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్ తెలిపారు. ఒడ్డుగూడం శివారు చేలలో ఆత్రం బాపు, కుడ్మెత లచ్చన్న అడవి పందిని హతమార్చి పోగులుగా ముక్కలు చేసి ఇంటికి తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా అటవీ అధికారులకు సమాచారం అందింది. ఎఫ్ఎస్ఓ బేగ్, బేస్‌క్యాంపు సిబ్బంది అక్కడికి వెళ్లి మాంసంతోపాటు నిందితులను అదుపులో తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలో అడవి పంది మాంసాన్ని ఖననం చేశారు.

దివ్యాంగుల క్రీడాపోటీల్లో ప్రతిభ



రాకేశ్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మంచిర్యాలకు చెందిన పాయిరాల రాకేశ్ క్యారం పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూప పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చిన అతనికి అభినందనలు తెలిపారు.

భార్యాభర్తలను కలిపిన న్యాయవాదులు



జంటను కలిపిన న్యాయవాదులు

ఆసిఫాబాద్: గత ఐదేళ్లుగా విడివిడిగా ఉంటూ విడాకుల కోసం ఆసిఫాబాద్ కోర్టు చుట్టూ తిరుగుతున్న భార్యభర్తలను న్యాయవాదులు కలిపారు. వివరాల్లోకి వెళ్తే..కౌటాలకు చెందిన జాపర్తి సునీల్, అపర్ణలకు 2019లో వివాహమైంది. వివిధ కారణాలతో వేర్వేరుగా ఉంటున్న వీరు గతేడాది విడాకుల కోసం ఆసిఫాబాద్ కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. న్యాయవాదులు సతీశ్‌బాబు, కిశోర్‌కుమార్‌లు కేసు స్వీకరించారు. గురువారం ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిని ఒక్కటి చేశారు.

సొంతింటి కల నెరవేర్చాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని ఐఎన్టీయూసీ నాయకులు కోరారు. యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, యూనియన్ నాయకులు ధర్మపురి, సమ్మయ్య, జె.శంకర్‌రావు ఉన్నారు.

సినిమా ఆటోగ్రఫీ కోర్సుపై అవగాహన

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో న్యాక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సినిమా ఆటోగ్రఫీ కోర్సుపై గురువారం న్యాక్ ఏడీ నాగేంద్ర అవగాహన కల్పించారు. ఈ కోర్సుతో విద్యార్థులకు ఉపాధి లభిస్తుదన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు తెలంగాణ సినిమా చాంబర్ నంబర్ కార్డు లభిస్తుందన్నారు. నైపుణ్యం, ఉపాధి ఉండే కోర్సులపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ రమేశ్, జిల్లా న్యాక్ ఇన్‌చార్జి ధవంత్ రమేష్, అధ్యాపకులు శంకర్, సురేశ్, వెంకటపతిరాజు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు గెలుపొందాలి

మంచిర్యాలటౌన్: నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు గెలుపొందాలని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్‌కు బయల్దేరి వెళ్తున్న జట్టు సభ్యులకు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్ రెడ్డి, కోచ్ సునర్కర్ అరవింద్, రెఫరీలు సాయి, రాజశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్టు: ఆసిఫాబాద్ నుంచి సత్యభామ, నందిని, అంజలి, కవిత, అనూష, శిరీష, పల్లవి, ఖుషి, రెబ్బెన నుంచి శిరీష, మందమర్రి నుంచి వైష్ణవి, జైపూర్ నుంచి హాసిని, లక్సెట్టిపేట్ నుంచి శృతి, శివాత్మిక, మౌనిక, ఆదిలాబాద్ నుంచి స్ఫూర్తి, సింధు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- డీడీఎంఎస్ ప్రేమ్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

శ్రీరాంపూర్: ప్రమాదాల నివారణకు పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల రక్షణ అధికారులతో రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా రక్షణలో వస్తున్న మార్పులు గమనిస్తూ పనిచేయాలన్నారు. రక్షణ నియమాలు అమలు చేస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా రక్షణ పనిముట్లు, పరికరాలు ఉపయోగించి పనిచేయాలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, ఇతర ఏరియాలో రక్షణ అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

జన్నారం: ప్రతి ఒక్కరికి రాజ్యాంగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయవాది కృష్ణస్వరూప్ అన్నారు. మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ సదస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ అన్నివర్గాల కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మహిళల కోసం చట్టాలు రూపొందించారన్నారు. దేశంలో రాజ్యాంగం మార్చే కుట్ర జరిగితే భవిష్యత్‌లో బానిస బతుకులవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుల రాజలింగం, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్ల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి అశోక్, నేతకాని మహార్ కుల సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జాడి సుధాకర్, రాష్ట్ర నాయకులు దుర్గం అమృతరావు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, హెచ్ఎం శివరాజం, ఉపాధ్యాయులు రాథోడ్ పిరాజీ, కరుణాకర్, సాయికుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

స్ట్రక్చరల్ సమావేశంలో పలు డిమాండ్లు అంగీకారం



పాల్గొన్న యాజమాన్యం, ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో చాలాకాలం తర్వాత గుర్తింపు సంఘం, యాజమాన్యం మధ్య స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్‌లో డైరెక్టర్(పా) లెవల్‌లో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ నేతలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్లను యాజమాన్యం ముందు పెట్టారు. ఇందులో ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం అంగీకారం తెలిపిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్లు, టెక్నికల్ సూపర్‌వైజర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సూటబుల్ ఎంప్లాయిమెంట్ కల్పించడం, ట్రేడ్స్‌మెన్స్, ఈపీ ఆపరేటర్స్ సూటబుల్ ఎంప్లాయిమెంట్‌పై వచ్చేనెలలో జరిగే సీఎండీ లెవల్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. డిస్మిస్ అయిన జేఎంఈటీలను తిరిగి ఉద్యోగాల్లో తీసుకోవాలన్నారు. వేజ్‌బోర్డులో లేని 11 రకాల అలవెన్సు పెంపుదల, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో ఓసీపీ, సీఎస్పీలకు వేర్వేరుగా ఇన్సెంటీవ్ అమలు, కొత్త ఇన్సెంటివ్ విధానంపై కమిటీ వేసి కమిటీ నిర్ణయం తదితర డిమాండ్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌తోపాటు కేంద్ర కమిటీ నాయకులు మిరియాల రంగయ్య, సారయ్య, వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వంగ వెంకట్, రాంగోపాల్ పాల్గొన్నారు.

నేడు కాగ్నిజెంట్ పరిశ్రమల సందర్శన

బాసర: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ పరిశ్రమలను సందర్శించనున్నారు. అక్కడ ప్రముఖ ఐటీ కంపెనీల గురించి తెలుసుకోనున్నారని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, వివిధ విభాగాల అధిపతులు ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ విజయ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.